క్లుప్తంగా

ముగిసిన కల్యాణోత్సవాలు

కొత్తపల్లి: మూలపేటలో వేంచేసియున్న బలభద్ర సుభద్ర సమేత జగన్నాథస్వామి, దేవి భూదేవి సమేత శ్రీ సత్యనారాయణస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు బుధవారం రాత్రి శ్రీ పుష్పయాగంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కల్యాణ మహోత్సవాలు ఆలయ కమిటీ అధ్వర్యంలో నిర్వహించారు. స్వామివారిని గ్రామా సర్పంచ్ కంబాల మౌనిక, ఎంపీటీసీ సభ్యురాలు అడ్డా పాప, వైఎస్సార్ సీపీ నాయకులు కంబాల లక్ష్మణ్‌రావు, అడ్డా త్రిమూర్తులు దర్శించుకున్నారు.

ఏలేరులో కుళ్లిన కోళ్లు



ఏలేరు కాలువలోకి కొట్టుకొస్తున్న చనిపోయిన కోళ్లు

పెద్దాపురం: మండలంలోని గోరింట శివారు కోళ్లఫారంలో మృతి చెందిన కోళ్లను ఏలేరు కాలువలో వేస్తుండడంతో వడ్లమూరు, గోరింట గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. ఎటువంటి అనుమతులు లేని కోళ్ల ఫారం నుంచి వ్యర్థాలు కాలువలోకి వదులుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, సత్వర చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయాల్లో దవులూరి పూజలు



రాములవారిని దర్శించుకున్న దవులూరి దొరబాబు

పెద్దాపురం: పట్టణంలో నాయీ బ్రాహ్మణ కాలనీలో నూతనంగా నిర్మించిన సీతారామ గణపతి సాయి ఆలయం రామాలయ నూతన నిర్మాణ ప్రారంభోత్సవం, కట్టమూరు సత్తెమ్మ తల్లి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు విడదాసరి రాజా, తమిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, తాడి రాజశేఖర్, కౌన్సిలర్లు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఏలేటి అనంతలక్ష్మి , పవర రాజుబాబు, చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ చలానాలు చెల్లించాలి

సామర్లకోట: వివిధ రకాల వాహనాలకు విధించిన జరిమానా చలానాలను సకాలంలో చెల్లించాలని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక అవుట్ పోస్టు పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకర్ల సమావేశంలో ట్రాఫిక్ నింబంధనలను వివరించారు. 2018 నుంచి అనేక మంది వాహనాలకు విధించిన అపరాధ రుసం చెల్లించక పోవడంతో ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు వాటిపై దృష్టి సారించి వసూలు చేయాలని ఆదేశించినట్టు తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి పెండింగ్ చలానాలకు సంబంధించి వాహనాలను తనిఖీ చేయనున్నట్టు తెలిపారు. 2005–10 వరకు తాను సామర్లకోట కానిస్టేబుల్‌గా పని చేయడం వల్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తెలియడంతో ఎస్పీ ట్రాఫిక్‌లో నియమించారని చెప్పారు. ఈ మేరకు పెండింగ్ చలానాలు ఉన్న వారు మీ సేవా కేంద్రాలల్లో చెల్లించాలని ఆయన సూచించారు. నంబరు బోర్డులు లేకుండా వాహనాలు కనిపిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కళాశాలల సమయంలో బస్సుల్లో విద్యార్థులు ఫుట్‌పాత్‌లపై వేలాడతూ ప్రయాణించకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పోలీసు రింగ్ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ ఇన్‌గేట్ వరకు ఆటోల రాక పోకల నిలుపుదల అమలులో ఉన్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

12న ఉచిత మెగా వైద్య శిబిరం

కొత్తపల్లి: మండలంలోని నాగులాపల్లిలో ఈ నెల 12వ తేదీన ఉచిత సూపర్ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు కాకినాడ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు బుధవారం తెలిపారు. ఈ శిబిరం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఉదయం 9గంటలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ శిబిరానికి అన్ని వ్యాధులకు సంబంధించిన వైద్య నిపుణులు హాజరవుతారన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

శంఖవరం: ఎయిడ్స్ రోగులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని రిఫరల్ ఆసుపత్రి చైర్మన్ స్లెషర్ బాబు, సంకల్పం లీడర్ శంకర్ అన్నారు. మండలంలోని సీతంపేట రిఫరల్ ఆసుపత్రిలో సంకల్పం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ రోగులకు పౌష్టికాహం కిట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎయిడ్స్ రోగులు పౌష్టికాహారం తీసుకుని మందులు క్రమం తప్పకుండా వాడాలన్నారు.

ఆటోల రాజ్యం.. నియంత్రణ పూజ్యం

- ట్రాఫిక్ చక్ర బంధంలో పిఠాపురం
- రోజురోజుకు తీవ్రమవుతున్న సమస్య



ఉప్పాడ సెంటర్లో నడిరోడ్డు నిండా ఆటోలే

పిఠాపురం: పిఠాపురంలో ట్రాఫిక్ సమస్య తగ్గకపోగా రోజురోజుకు తీవ్రమవుతోంది. నిత్యం పట్టణంలో వేలాదిగా తిరుగుతున్న ఆటోలు ఇష్టారాజ్యంగా నడుపుతుండడంతో కొత్త ట్రాఫిక్ సమస్యలను సృష్టిస్తున్నాయి. సమస్య అనేదే లేకుండా చేస్తాం, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తాం, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం అంటూ చేస్తున్న పోలీసుల ప్రకటనలు మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. అధికారులు ఏనాడూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించిన పాపాన పోలేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఎప్పుడు చూసినా పోలీసులు ఇష్టారాజ్యంగా తిరుగుతూ ప్రయాణికులకు నరకం చూపిస్తున్న ఆటోలను, భారీ వాహనాలను పట్టించుకోలేదని ప్రయాణికులు చెబుతున్నారు.

ఎక్కడబడితే అక్కడ పార్కింగ్

దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోంది. పట్టణంలో ఉన్న వేలమంది జనాభాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారితో పట్టణం నిత్యం కిటకిటలాడుతూ ఉంటుంది. ప్రతీ రోజూ పదివేల ఆటోలు పట్టణంలో తిరుగుతున్నట్లు పోలీసులే చెబుతున్నారు. పిఠాపురానికి బైపాస్‌రోడ్డు నిర్మించినప్పటికీ అతి తక్కువ వాహనాలు తప్ప ఇతర వాహనాలన్నీ పట్టణం మీదుగానే వెళుతుంటాయి. ముఖ్యంగా ఆటోలు ఇష్టారాజ్యంగా ఎక్కడ పడితే అక్కడ ఆపి రోడ్డుకు అడ్డంగా పార్కింగ్ చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేడని వాహనచోదకులు వాపోతున్నారు. పట్టణంలో ప్రధాన కూడళ్లైన ఉప్పాడ సెంటర్, కోటగుమ్మం సెంటర్, చర్చి సెంటర్, సినిమా సెంటర్‌ల వద్ద ఎటువంటి సిబ్బంది లేక ఆటోలు ఇతర వాహనాలు రోడ్డుకు అడ్డంగా నిలుపుతుండడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆటోవాలాలతో సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరికలు జారీ చేసిన పోలీసులు ఆ తర్వాత వదిలేయడంతో మళ్లీ ఆటో డ్రైవర్ల ఇష్టారాజ్యంగా వ్యవహరించడం ట్రాఫిక్ సమస్యను తీవ్రతరం చేసిందంటున్నారు. ట్రాఫిక్ ఆంక్షలు లేకపోవడంతో వాహనాలను ఎవరి ఇష్టానుసారం వారు నిలిపివేస్తుండడంతో సమస్య రోజురోజుకు పెరుగుతూనే ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుండడంతో నరకం చవిచూస్తున్నామని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఎక్కువ మంది సిబ్బందిని ట్రాఫిక్ క్రమబద్ధీకరణకే వినియోగించాల్సి వస్తోందంటున్న పోలీసులు.. బందోబస్తుకు పరిమితమై అరకొర సిబ్బందినే ట్రాఫిక్ నియంత్రణకు నియమిస్తున్నారు. ఎవరైనా నాయకుడు వచ్చినప్పుడు సెంటర్‌కు ఇద్దరేసి కాపలా ఉండే పోలీసులు.. సాధారణ సమయాలలో మాత్రం ఒక్కరూ ఉండకపోవడం ట్రాఫిక్ సమస్యకు కారణమవుతోంది.

త్వరలో కట్టుదిట్టమైన చర్యలు

పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. దీనిపై త్వరలో తగిన చర్యలు తీసుకుంటాం. ఆటోలు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయడం వల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నివారణకు అన్ని చర్యలు తీసుకుంటాం. రోడ్లపై చిరు వ్యాపారులను ఖాళీ ప్రదేశాలకు తరలించి ఆటోలు నిర్దిష్టమైన ప్రాంతాల్లో నిలుపు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– వైఆర్‌కే శ్రీనివాస్, సీఐ, పిఠాపురం

అన్న సమారాధన



స్వామివారి శ్రీ పుష్పయాగం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని కొండెవరంలో వేంచేసియున్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలలో భాగంగా బుధవారం అన్న సమారాధన నిర్వహించారు. కళాపరిషత్ చైర్మన్ మేడిశెట్టి శ్రీరాములు, పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కొండెవరం గ్రామం నుంచే కాకుండా వాకతిప్ప, ఇసుకపల్లి, నవఖండ్రవాడ గ్రామాల నుంచి సుమారు 5వేల మంది భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీరించారు.

శ్రీపుష్పయాగం

పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారి శ్రీ పుష్పయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ఊయలలో ఉంచి అలంకరించారు.

కుట్టు మెషీన్ల అందజేత



మెషీన్లు అందజేసిన వైస్ చైర్మన్, కౌన్సిలర్

సామర్లకోట: కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న పేద మహిళలకు స్థానిక 17వ వార్డు కౌన్సిలర్ మిరియాల కరుణ లలిత మేరీబాయి, వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి సాగర్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 20 కుట్టు మెషీన్లు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైస్ చైర్మన్ గోకిన సునేత్రాదేవి మాట్లాడుతూ కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

హక్కుల సాధన ప్రతి ఒక్కరి బాధ్యత

- మహిళలకు సివిల్ జడ్జి బుల్లెమ్మ పిలుపు
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సామర్లకోట అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టరు, లాయర్, ఎస్సైలకు సత్కారం



మహిళా దినోత్సవంలో ప్రసంగిస్తున్న జడ్జి బుల్లెమ్మ

పెద్దాపురం: హక్కుల సాధన ప్రతి ఒక్కరి బాధ్యత అని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బుల్లెమ్మ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వేదుల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మహిళలు వారి హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏపీపీ మృత్యుంజయ రావు, న్యాయవాదులు మడికి రాంబాబు, ప్రభూజీ, కందుల వెంకటాచలం పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఏపీఎం సూర్యనారాయణ, పీఎల్‌వీలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మండలంలోని పులిమేరులో ఉన్న శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో ప్రిన్సిపాల్ రాయవరపు సత్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అలాగే స్థానిక వైజ్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షురాలు బి.మల్లీశ్వరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై వెలుగుల సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని సమాన గుర్తింపు కోసం మహిళలు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాసరావు, బార్ అసోషియేషన్ అధ్యక్షులు వేదుల మణి, మానవ హక్కుల సంఘం నాయకులు నూతలపాటి అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో జిల్లా గ్రంథాలయ శాఖాధికారి ఎం.శేఖర్‌బాబు, సాహితి స్రవంతి జిల్లా అధ్యక్షులు జోస్యుల కృష్ణబాబు మహిళలనుద్దేశించి ప్రసంగించారు.

50 శాతం రిజర్వేషన్లు సాధిద్దాం..

సమాజాభివృద్ధిలో సగభాగం మహిళలదేనని, అన్ని రంగాల్లో వారికి 50 శాతం రిజర్వేషన్ సాధించేందుకు పోరాడదామని సీఐటీయూ జిల్లా నాయకులు వీరలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో ఐద్వా, శ్రామిక మహిళా, సీఐటీయూ, యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఐద్వా అధ్యక్షురాలు కూనిరెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యంతోనే ప్రగతి

అన్ని రంగాల్లో మహిళలకు ప్రభుత్వం ప్రాధాన్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణ

మహిళా చైతన్యంతో సాధికారత..

సామర్లకోట: మహిళా చైతన్యంతోనే ప్రగతి సాధ్యమని గుర్తించిన సీఎం జగన్ మహిళలకు అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానికుడైన దవులూరి దొరబాబును ఎమ్మెల్యేగా చేసుకోవడానికి మహిళలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆమెతో పాటు, వైస్‌చైర్మన్లు గోకిన సునేత్రాదేవి, ఉబా జాన్ మోజెస్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, మహిళా కౌన్సిలర్లు పట్టణ పరిధి బ్యాంకుల్లోని మహిళా మేనేజర్లను సత్కరించారు. మంచి సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ఆర్పీలు ప్రతిజ్ఞ చేశారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఉత్తమ సేవలు

స్థానిగ గణపతినగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో కౌన్సిలర్లు రెడ్నం సునీత, పాగా సురేష్‌కుమార్, నేతల హరిబాబు ఆధ్వర్యంలో డాక్టర్ పి.జ్యోతి, ఎస్సై టి.సునీత, న్యాయవాది కొర్లమండ శ్రీవాణిలను సత్కరించారు. అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి, మాజీ కౌన్సిలర్ పాగా శిరిష, అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మాకు కంప్యూటర్ బహూకరణ



కంప్యూటర్ అందజేసిన ఎస్‌బీఐ మేనేజర్

సామర్లకోట: మెప్మా కార్యాలయానికి స్థానిక స్టేట్ బ్యాంకు అధికారులు కంప్యూటర్ బహూకరించారు. చీఫ్ మేనేజరు చల్లపల్లి రాజాబాబు, మెప్మా సీటీ మిషన్ మేనేజరు సుజాత, ఇతర సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు అండగా ప్రభుత్వం



సర్పంచ్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

- ఎంపీ వంగా గీత
- పిఠాపురంలో ఘనంగా మహిళా దినోత్సవం

పిఠాపురం: ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లోనూ సముచిత స్థానం కల్పించడంతో పాటు వారి రక్షణకు దిశా చట్టం తీసుకువచ్చి పగడ్బందీగా అమలు చేస్తోందని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం పిఠాపురం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. పిఠాపురం 12వ వార్డులో కౌన్సిలర్ బొజ్జా నగదీశ్వరీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముగ్గులు, వంటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే దొరబాబు మహిళతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళా ప్రజాప్రతినిధులను సన్మానించారు. వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, పిఠాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి, వైస్ చైర్ పర్సన్లు పచ్చిమళ్ల జ్యోతి, కొత్తపల్లి పద్మ, పలువురు మహిళా కౌన్సిలర్లు, మహిళలు పాల్గొన్నారు.

గు'లాభ' జామ అమ్మకాలు

- స్థానికంగా పంట
- అందుబాటులో ధరలు



పిఠాపురం మండలం వనఖండ్రవాడ వద్ద అమ్మకానికి సిద్ధం చేసిన గులాబ్‌జామ కాయలు

పిఠాపురం : వేసవిలో దాహం తీర్చి శరీరానికి మంచి పోషక విలువలు ఇచ్చే గులాబ్ జామ (వాటర్ యాపిల్) పిఠాపురం నియోజకవర్గంలో జోరందుకున్నాయి. రైతులు అంతర పంటగా సాగు చేస్తూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. మండలంలో వనఖండ్రవాడలో ఉన్న నర్సరీలో ఈ మొక్కల పెంపకం చేపట్టారు. ఇక్కడ సాగు చేసిన గులాబ్‌జామ చెట్లు విరగకాస్తుండడంతో మంచి ఆదాయం వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఒక్కో చెట్టు ఈ సీజన్‌లో అరటన్నుకు పైగా కాపు కాస్తున్నట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం కేజీ రూ.60 వరకు ధర పలుకుతోందని, రోజుకు 20 నుంచి 30 కేజీల దిగుబడి వస్తోందని చెబుతున్నారు. ఒక్కో చెట్టు రోజుకు 10 కేజీల వరకు దిగుబడి వస్తుండగా ఇక్కడ మామిడి, కొబ్బరి తోటల్లో అంతర పంటగా వేయడం వల్ల అదనపు ఆదాయం వస్తోందని రైతు అప్పారావు చెబుతున్నారు. గతంలో ఇతర ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన గులాబ్ జామ ప్రస్తుతం స్థానికంగా లభిస్తుండడంతో పలువురు కొనుగోలు చేస్తున్నారు. నర్సరీలలో ఒక్కో మొక్క రూ.150 నుంచి రూ.300 వరకు అమ్ముతున్నారు. వివిధ తోటల్లోనే కాకుండా ఇళ్ల వద్ద వీటిని పెంచుతున్నారు. ప్రస్తుతం పిఠాపురం మార్కెట్‌లోనూ ఇవి లభిస్తున్నాయి. ఉప్పాడ, పిఠాపురం రోడ్డులో తాజా గులాబ్ జామ కాయల విక్రయాలు జోరందుకున్నాయి. గతంలో కడియం వంటి ప్రాంతాల్లోని నర్సరీలలో మాత్రమే దొరికే ఈ మొక్కలు ఇక్కడ అందుబాటులోకి రావడంతో పలువురు కొనుగోలు చేసి తోటల్లోనూ, ఇళ్ల వద్ద పెంచుతున్నారు. ఆరోగ్యకరమైన పండ్లతో పాటు ఆదాయం వస్తుండడంతో అందరు వీటిపై మొగ్గు చూపుతున్నారు. స్థానికంగా అందుబాటులో ఉండడంతో కొనుగోలుదారులకు అనువైన ధరలో దొరుకుతున్నాయి.



పిఠాపురం మండలం వనఖండ్రవాడలో మామిడి తోటలో వేసిన గులాబ్‌జామ చెట్లు

జీడి పప్పు సిరి శ్రమలు

- పలువురికి ఉపాధి కల్పిస్తున్న వైనం
- శ్రామికులుగా వేలాదిమంది మహిళలు



జీడి పిక్కలను కటింగ్ చేస్తున్న మహిళలు



జీడి పప్పును గ్రేడింగ్ చేస్తున్న మహిళలు

తుని రూరల్: వేలాదిమంది మహిళలకు జీడి పప్పు పరిశ్రమలు (ఫ్యాక్టరీలు) ఉపాధి కల్పిస్తున్నాయి. నీడపట్టునే ఉంటూ రోజూ సంపాదించే అవకాశం లభించడంతో గ్రామీణ మహిళలు పెద్ద సంఖ్యలో ఫ్యాక్టరీలలో పనికి వెళుతున్నారు. జీడి గింజల కటింగ్, పొట్టు తీయడం, పప్పును పరిమాణాన్ని బట్టి గ్రేడింగ్ చేయడం తదితర పనులు చేస్తూ మహిళలు సంపాదిస్తూ తమ కుటుంబాలకు చేదోడుగా నిలుస్తున్నారు. మెట్ట ప్రాంతంలో జీడి పప్పు ఫ్యాక్టరీలు మహిళల ఉపాధిని చూపుతున్నాయి. ఇంటి పనులు చక్కబెట్టుకుని అందుబాటులో ఉండే ఫ్యాక్టరీకి వెళ్లే మహిళలు రోజుకి రూ.300 నుంచి రూ.450 వరకు సంపాదిస్తున్నారు. ఇలా నెలకు రూ.ఎనిమిది వేల నుంచి రూ.12 వేల వరకు సంపాదించి, ఆయా కుటుంబాలకు ఆర్థిక భరోసానివ్వడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. తుని ప్రాంతంలో ఉన్న జీడి పప్పు ఫ్యాక్టరీల్లో ఆరువేల మందికి పైగా మహిళలు రోజూ ఉపాధి పొందుతున్నారు. పండగలు, పర్వదినాలు, వేసవిలో పనులు చేసేందుకు కూలీల కొరత ఎదురవుతోందని ఫ్యాక్టరీ యజమానులు చెబుతున్నారు.

20కి పైగా ఫ్యాక్టరీలు

ఉద్యానశాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలో తొమ్మిది వేల హెక్టార్లలో జీడి తోటలు సాగవుతున్నాయి. దీంతో సబ్ డివిజన్ పరిధిలోగల తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో అధికారికంగా 20కి పైగా జీడిపప్పు పరిశ్రమలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా ఇళ్ల వద్ద మరో 30 వరకు జీడి పప్పు శుద్ధి చేసే కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఒక్కొక్క ఫ్యాక్టరీలో 100 నుంచి 200 మంది వరకు పనులు చేస్తుండగా అందులో 90శాతం మంది మహిళలే కావడం విశేషం. పరిశ్రమల్లో జీడి గింజలు నిల్వ చేయడం, కాల్చడం, కటింగ్, శుద్ధి చేయడం, ఎగుమతికి అనువుగా ప్యాకింగ్ వంటి పనులు చేయాల్సి ఉంది. ఇళ్లవద్ద మహిళలు పప్పు శుద్ధి చేయడం, గ్రేడింగ్ పనులు చేస్తున్నారు.

15 రోజులకోసారి వేతనం

ఈ పనులన్నింటికీ యాజమాన్యాలు వేర్వేరుగా కూలి డబ్బులను 15 రోజులకు ఒకసారి లెక్కకట్టి చెల్లిస్తున్నాయి. బాయిలర్, ప్యాకింగ్, రవాణా పనులు పురుషులు చేస్తుండగా కాల్చిన జీడి గింజలను కటింగ్, పప్పుపై పొట్టు తీయడం, గ్రేడింగ్ చేయడం పనులను మహిళలు చేస్తున్నారు.

వారంలో నాలుగైదు రోజుల పని



సొంత ఊర్లోనే ఉన్న ఫ్యాక్టరీలో కాల్చిన జీడి గింజలను కటింగ్ చేసే పనులు చేస్తున్నాను. రోజుకి 20 కిలోలకు పైగా జీడి గింజలను కట్ చేస్తాను. వారంలో నాలుగైదు రోజులు పని ఉంటుంది. రోజుకు రూ.నాలుగు వందల వరకు సంపాదిస్తాను.

– రమణమ్మ, కేఓ మల్లవరం

కుటుంబానికి చేదోడుగా..



నా భర్త వ్యవసాయ పనులు చేస్తున్నాడు. నేను ఫ్యాక్టరీలో జీడి పప్పు శుద్ధి చేసే పనులు చేస్తున్నాను. నెలకు రూ.ఎనిమిది వేల వరకు లభిస్తుంది. ఇద్దరూ సంపాదించిన మొత్తంతో ఇంటి ఖర్చులు, పిల్లలకు దుస్తులు, ఇతర ఖర్చులకు ఇబ్బంది పడకుండా సరిపోతున్నాయి.

– ఆర్.లక్ష్మి, తంగేడ